

చిలుకూరు ఆలయం వద్ద మున్సిపాలిటీ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న చిలుకూరు గ్రామస్తులు

మున్సిపాలిటీ ఏర్పాటుపై నిరసన

- జీవో 111ను ఎత్తివేసిన తరువాతనే మున్సిపాలిటీని ఏర్పాటు చేయాలి
- పార్టీ ప్రయోజనాల కంటే ప్రజల బాగోగులే ముఖ్యం
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, చిలుకూరు మాజీ సర్పంచ్ వీరభద్రస్వామి

మొయినాబాద్, డిసెంబర్ 22 : మున్సిపాలిటీ పేదల అభివృద్ధి కోసమా..? పెద్దలకు లబ్ధి చేకూర్చడం కోసమా అని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, చిలుకూరు మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి అన్నారు. మొయినాబాద్‌ను మున్సిపాలిటీగా చేస్తున్నామని ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నాయకులు, మహిళా కార్యకర్తలు ఆందోళకు దిగి గ్రామపంచాయతీలుగానే ఉండాలని చిలుకూరు బాలాజీ స్వామిని వేడుకుంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 111 జీవో మొయినాబాద్ మండల ప్రజలకు గుదిబండలా తయారైందన్నారు. జీవోను అలాగే ఉంచి మొయినాబాద్‌ను మున్సిపాలిటీ చేయడంవల్ల ఎవరికి ప్రయోజనం చేకూరుతుందో తెలిపాలని ప్రశ్నించారు. ఇది పేదల కోసమా? పెద్దల కోసమా అని సందేహం వెలిబుచ్చారు. మున్సిపాలిటీని చేయాలనుకుంటే ముందుగా జీవోను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మండలంలో 80 శాతం కూలీనాలీ చేసుకొని జీవించే వారేనని ఆయన పేర్కొన్నారు. మండలం మున్సిపాలిటీగా మారితే పేదలు పన్నుల భారాన్ని ఎలా తట్టుకోగలుగుతారన్నారు. మండలంలోని 8 గ్రామాల ప్రజలు, నాయకులు ఎన్నడూ మున్సిపాలిటీ కావాలని కోరుకోలేదన్నారు. వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడమేంటని ప్రభుత్వాన్ని నిలదీశారు. మున్సిపాలిటీతో జరిగే నష్టాన్ని ప్రజలకు వివరిస్తామన్నారు. పార్టీ ప్రయోజనాల కంటే ప్రజలు బాగోగులే ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.

నిత్య ధ్యాన సాధనతో ఏకాగ్రత

- పరిణతి పత్రీ
- ధ్యాన మహాయాగంలో అలరించిన కళాకారుల నృత్య ప్రదర్శన

ధ్యాన మహాయాగం సభలో మాట్లాడుతున్న పరిణతి పత్రీ, కళాకారుల నృత్య ప్రదర్శన

కడ్తాల్, డిసెంబర్ 22 : నిత్యం ధ్యాన సాధనతో ఏకాగ్రత పెంపొందండంతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని, ధ్యాన గురువు సుభాశ్ పత్రీజీ చూపిన ధ్యాన మార్గంలో ప్రతి ధ్యాని నడవాలని పత్రీజీ కుమార్తె పరిణతి పత్రీ అన్నారు. మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహా పిరమిడ్‌లో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం-3 ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ప్రాతఃకాల సంగీత ధ్యానంలో సినీ ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ధ్యానులు పాల్గొన్నారు.

ఫైట్ మాస్టర్లు రామ్-లక్ష్మణ్ మాట్లాడుతూ.. జీవితంలో విపత్కర పరిస్థితులు ఎదురైనా సూక్ష్మాన్ని గ్రహించాలని తెలిపారు. ధ్యాన మహాయాగంలో సుభాశ్ పత్రీజీ, స్వర్ణమాల సందేశాలను వీడియో రూపంలో ప్రదర్శించారు. ఆధ్యాత్మికవేత్తల ధ్యాన సందేశాలు, పిరమిడ్ మాస్టర్లు తమ అనుభవాలను వివరించారు.

ప్రాతఃకాల ధ్యానంలో పాల్గొన్న ధ్యానులు

ధ్యాన మహాసభలకు వచ్చే ధ్యానులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం కళాకారులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ధ్యానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పిరమిడ్ మాస్టర్లు రచించిన ఆధ్యాత్మిక పుస్తకాలను ట్రస్ట్ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలలో అవకతవకలు జరగలేదు

శంషాబాద్ ఏపీఎం అహల్య

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 22: మహిళా సంఘాలలో ఎలాంటి అవకతవకలు జరగలేదని శంషాబాద్ ఏపీఎం అహల్య తెలిపారు. ఆమె నమస్తే తెలంగాణతో ఆదివారం మాట్లాడుతూ, శంషాబాద్ మండలం నర్కూడ గ్రామంలోని ఓ మహిళ సంఘంలో 'గోల్‌మాల్' అనే శీర్షికతో స్పందించిన ఏపీఎం అహల్య నర్కూడ గ్రామంలోని అవంతిక సంఘంలో సభ్యుల మధ్య సమన్వయం లేకపోవడంతో పాటు సభ్యురాలు సమావేశానికి పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. దీంతో ఆమెకు సంఘానికి సంబంధించిన వివరాలపై అనుమానం రావడంతో సదరు సభ్యురాలు భర్త మీడియాకు వివరించారు. దీంతో మీడియాలో వచ్చిన కథనానికి స్పందించి అవంతిక సంఘంలోని సభ్యులకు విచారణ చేశామని ఆరోపనలు చేస్తున్న సభ్యురాలు తీసుకున్న రుణం చెల్లించకుండానే మరో లోన్ ఇవ్వాలని పలుమార్లు సంఘం సభ్యులతో పాటు వీఏవోను అడిగినట్లు తెలిపారు. మొదట తీసుకున్న లోన్ మొత్తం చెల్లిస్తేనే మరో లోన్ ఇస్తామని స్పష్టం చేసినట్లు తెలిపారు. కానీ, సదరు సభ్యురాలు వినిపించుకోకుండా సంఘంలో అవకతవకలు జరుగుతున్నాయని తప్పుడు ఆరోపణలు చేశారని వివరించారు. దీంతో పాటు నర్కూడ గ్రామంలోని అవంతిక సంఘం సభ్యులు మాట్లాడుతూ మా సంఘం 2016 నుంచి ప్రారంభమై ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా కొనసాగుతుంది. ఇటీవల ఓ సభ్యురాలు తీసుకున్న రుణం చెల్లించకుండానే మరో లోన్ ఇవ్వాలని పట్టుబట్టినట్లు తెలిపారు. తీర్మానాలు, రిజిస్టర్‌లో కొన్ని వివరాలు నమోదు చేయలేదు. కానీ, ఎలాంటి అవకతవకలు జరగలేదు.

88.89 లక్షల వాహనాలు..

ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో 88.89 లక్షల వాహనాలున్నాయని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి 48.81 లక్షల చలాన్లు వేసినట్లు చెప్పారు. సీసీఎస్‌లో గతేడాది 361 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది 248 కేసులు నమోదయ్యాయన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రకటనలు చూసి ప్రీలాంచ్ ఆఫ్లర్లకు ఆకర్షితులై డబ్బు చెల్లించారని, అలాంటి కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా జరుగుతున్నదన్నారు. మోసం చేసిన వారి ఆస్తులను గుర్తించి అటాచ్ చేస్తున్నామని, కోర్టు ఆదేశాలతో ఆ ఆస్తులను వేలం వేస్తామన్నారు. డయల్ 100కు ఫోన్ చేస్తే 7 నిమిషాల్లోపే పోలీసులు స్పందిస్తున్నారన్నారు. నగరంలో సౌండ్ పొల్యూషన్‌పై కఠినంగా వ్యవహరిస్తున్నామని, ముత్యాలమ్మ ఆలయ ఘటన తరువాత నిరాశ్రయులై రోడ్డుపై ఉండే వారికి షెల్టర్ ఇచ్చేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. సైబర్ నేరాల్లో సుమారు రూ. 297 కోట్లు ప్రజలు నష్టపోయారన్నారు. ఈ ఏడాది గుజరాత్, రాజస్థాన్, సౌత్ ఇండియా మాడ్యుల్స్‌కు చెందిన వారిని భారీ స్థాయిలో అరెస్ట్ చేశామన్నారు. సైబర్‌నేరాల్లో డిటెక్షన్ శాతం పెరిగిందన్నారు. బ్యాంకింగ్ సిస్టమ్ సరిగ్గా లేకపోవడంతో కరెంట్ అకౌంట్స్ ఈజీగా సంపాదిస్తున్నారని, ఈ నేపథ్యంలోనే యాక్సిస్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్, ఆర్‌బీఎల్ బ్యాంకు డిప్యూటీ మేనేజర్లను అరెస్ట్ చేశామన్నారు. మాదక ద్రవ్యాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

నేరాలు రెట్టింపు..

భాగ్యనగరంలో పెరిగిన క్రైమ్ రేట్

66 శాతం రెట్టింపైన దొంగతనాలు

- సైబర్ నేరాల్లో సుమారు రూ. 297 కోట్లు నష్టపోయిన ప్రజలు
- 7 నిమిషాల్లో డయల్ 100 రెస్పాన్స్
- సిటీలో పోలీసింగ్‌పై పట్టులేని క్షేత్రస్థాయి సిబ్బంది
- నెమ్మదించిన కేసుల ఛేదన
- సిటీ పోలీస్ వార్షిక నివేదిక (2024)ను విడుదల చేసిన నగర సీపీ సీవీ ఆనంద్
- బౌన్సర్లు అతిగా చేస్తే ఊరుకునేది లేదంటూ..హెచ్చరిక

సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో భారీగా నేరాలు పెరిగాయి. దోపిడీలు, దొంగతనాలు, కిడ్నాప్, దాడులు ఇలా అన్ని రకాల నేరాలు పెరుగుతూ వెళ్లాయి. గతేడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత హైదరాబాద్‌లో శాంతి భద్రతలు అదుపు తప్పాయి.నేరాల సంఖ్య పెరుగుతూ వెళ్లింది.. ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆదివారం నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ విడుదల చేసిన వార్షిక నివేదిక(2024)లో పలు అంశాలు ఇవీ.. నగర వ్యాప్తంగా ఈ ఏడాది 35,944 కేసులు నమోదయ్యాయి. అదే 2023లో ఈ సంఖ్య 25,488గా ఉండగా, ఇది 41 శాతం పెరుగుదల కనిపిస్తున్నది. ఇందులో ఆస్తులకు సంబంధించిన కేసులు గతేడాది 3,198 నమోదు కాగా, ఈ ఏడాది 5,328 నమోదయ్యాయి. అంటే దొంగతనాలకు సంబంధించిన కేసుల్లో 66 శాతం పెరిగాయని నివేదిక వెల్లడించింది. గత ఏడాది 67 శాతం కేసుల ఛేదన ఉండగా, ఈ ఏడాది 59 శాతానికి పడిపోయింది. ఈ ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికలు, అంతకు ముందు జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నగర పోలీస్ విభాగంలో భారీగా బదిలీలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎన్నికల నిబంధనల మేరకు హైదరాబాద్‌లో పని చేసిన వాళ్లు ఇతర జిల్లాలు, కమిషనరేట్లకు, అక్కడ పని చేసిన వాళ్లు హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. దీంతో జిల్లాలు, ఇతర కమిషనరేట్ల నుంచి వచ్చిన అధికారులకు హైదరాబాద్ పోలీసింగ్‌కు సంబంధించి పూర్తి అవగాహన లేకపోవడంతోనే నేరాలు పెరిగాయని అధికారులు పేర్కొంటున్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ పటిష్టంగా ఉండాలని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి సిటీ పోలీసింగ్‌పై అవగాహన సరిగా లేకపోవడంతో మొదట్లో కొంత తడబడ్డారన్నారు.

ట్రై కమిషనరేట్ల సమన్వయంతో..

ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు రోప్‌ను వచ్చే ఏడాది మరింత పటిష్టగా అమలు చేస్తామని సీపీ ఆనంద్ వెల్లడించారు. ఇందుకు టౌన్ వెండింగ్ కమిటీలను ఏర్పాటు చేస్తామని, ట్రై పోలీస్ కమిషనరేట్లను సమన్వయం చేసుకుంటూ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పనిచేస్తామన్నారు. ట్రాఫిక్ విభాగం ప్రజలతో నిరంతరం ముడిపడి ఉంటుందని, ట్రాఫిక్ సాఫీగా వెళ్తే పోలీసులు బాగా చేస్తున్నారని ప్రజలు అనుకుంటారని, ట్రాఫిక్ సాఫీగా వెళ్లకపోతే ప్రజలు పోలీసుల పనితీరుపై విమర్శిస్తారని, అందుకే ట్రాఫిక్‌పై ప్రధాన దృష్టి సారిస్తామన్నారు. సీసీ కెమెరాలపై స్పెషల్ ఫోకస్ పెడుతామని, పాడైన కెమెరాలను బాగుచేయడం, మరిన్ని కెమెరాలను ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

అతిగా చేస్తే..ఉక్కుపాదం..

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై సీపీ స్పందిస్తూ..బౌన్సర్ల ప్రవర్తన సరిగ్గా ఉండడం లేదని ఆయా ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా బౌన్సర్ పోలీసులను టచ్ చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. వీఐపీలు, వీవీఐపీలు తమ కార్యక్రమాలు నిర్వహించుకునే సమయంలో బౌన్సర్లకు, అక్కడి పరిస్థితులకు సంబంధించిన బాధ్యత వాళ్లదే ఉంటుందన్నారు. బౌన్సర్లు అతిగా చేస్తే..చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రధానమైన నేరాల వివరాలు 2023-2024

నేరాలు	2023	2024
సొత్తు కోసం హత్యలు	2	6
బందిపోటు	16	29
దోపిడీలు		
వివిధ రకాల	101	219
దొంగతనాలు	2694	3827
హత్యలు	89	77
హత్యా యత్నాలు	274	214
కల్పబుల్ హోమిసైడ్	09	26
లైంగిక దాడులు	453	584
కిడ్నాపులు	172	324
మోసాలు	5250	5303
సైబర్ నేరాలు	21878	25831
రోడ్డు ప్రమాదాలు	2548	2745
రోడ్డు ప్రమాద మరణాలు	327	215

పేదలకు అండగా ఉంటా..

కష్టు సాధించిన దివ్యాంగులను అభినందిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, డిసెంబర్ 22 : మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లెనిన్ నగర్ ప్రధాన రహదారి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు చవ్వ శ్రవణ్, గాజుల మధు మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి ఆదివారం వినతి పత్రం అందజేశారు. లెనిన్ నగర్ రైతు బజార్ నుంచి బడంగ్‌పేట కమాన్ వరకు రోడ్డు అధ్వానంగా ఉందని వారు తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి రోడ్డు సమస్యను పరిష్కరించాలని ఆదేశాలు జారీచేశారు. రహదారులకు మరమ్మతులు చేయించాలన్నారు.

దివ్యాంగులను అభినందించిన ఎమ్మెల్యే

బడంగ్‌పేటకు చెందిన దివ్యాంగులు జాతీయ స్థాయి దివ్యాంగుల క్రికెట్ పోటీలలో కప్ సాధించిన సందర్భంగా రామకృష్ణ ఆధ్వర్యంలో దివ్యాంగులు మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిశారు. దివ్యాంగులు పట్టదలతో క్రికెట్‌లో ప్రతిభ కనబర్చిడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బడంగ్‌పేట అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, మీర్‌పేట బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

కందుకూరు : నిత్య జీవితంలో ప్రజలు మానసిక ంగా ప్రశాంతంగా ఉండాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో మండల కేంద్రం స్వాములు అయ్యప్ప దీక్ష చేపట్టి 41 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇరుముడి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అయ్యప్పను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేదలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నేదునూరు గ్రామానికి అరవింద్ చారి చేతికి సంబంధించిన శస్త్ర చికిత్స కోసం డబ్బులు లేకపోవడంతో స్థానిక మాజీ సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డితో సబితా ఇంద్రారెడ్డిని కలిసి సమస్యను విన్నవించారు. ఆమె స్పందించి తక్షణమే ఎల్ఓసీ ద్వారా మంజూరైన రూ.40వేల లెటర్‌ను అందజేశారు.

ఖర్చు ఘనం..చెత్త పదిలం..!

సిటీబ్యూరో, డిసెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పుతున్నది. చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాల్సిన జీహెచ్ఎంసీ అమలులో పూర్తిగా విఫలమవుతున్నది. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, వ్యాధుల నివారణకు ఏటా రూ.300 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నా..లక్ష్యాన్ని మాత్రం సాధించలేకపోతున్నది. ఇంటింటికీ తడి, పొడి చెత్త సేకరణ, తరచూ చెత్త వేసే ప్రాంతాల (గార్బేజీ వనరేబుల్ పాయింట్లు/జీవీపీ) ఎత్తివేతలో అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతున్నది. గ్రేటర్ వ్యాప్తంగా చెత్త డబ్బాలను ఎత్తి వేయగా..ఇప్పటికీ 2640 చోట్ల చెత్త కుప్పలున్నట్లు అస్కి (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) సర్వేలో తేలడమే అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్నది. ఈ నేపథ్యంలోనే ఎక్కడా చూసినా పెద్ద పెద్ద చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వ్యర్థాలతో నిండిపోయిన బస్తీలు, కాలనీలు వెరసి దోమలతో దవాఖానల్లో పెరుగుతున్న వ్యాధి పీడితులతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. దీనికి కారణం అడుగడుగునా కొందరు అధికారుల అవినీతి లెక్కలు, రికార్డుల్లో తప్ప క్షేత్రస్థాయిలో కనిపించని సిబ్బంది..కాగితాల్లో మాత్రమే కనిపించే చెత్త తరలింపు..మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ మొదలుకొని డిప్యూటీ కమిషన్ల వరకు ఆకస్మిక పర్యటనల లేమి వరకు లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ఒక్క వీఐపీలు ఉండే ప్రాంతాలు, ప్రధాన రహదారుల్లో పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా కనబడుతుందే తప్ప.. కాలనీలు, బస్తీల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగడంలేదన్న విమర్శలున్నాయి.

ఎక్కడ చూసినా..

గార్బేజ్ ఫ్రీ సిటీయే లక్ష్యమని జీహెచ్ఎంసీ చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం ఇందుకు విరుద్ధంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఉప్పల్ చిలుకానగర్ నుంచి నాచారం మెయిన్ రోడ్, కవాడిగూడ ప్రధాన రహదారి, బన్సీలాల్‌పేట, ముషీరాబాద్, షేక్‌పేట దర్గా, ఓయూ కాలనీలో రహదారుల పక్కనే చెత్త, నిర్మాణ వ్యర్థాలు వేసేస్తున్నారు. మాదాపూర్ కావూరి హిల్స్ ప్రధాన రహదారి, పర్వత్‌నగర్‌తో పాటు పాతబస్తీలోని 70 శాతం ప్రాంతాల్లో అపరిశుభ్రత తాండవిస్తున్నది. చార్మినార్ నుంచి గుల్జార్ హౌస్ వెళ్లే దారిలో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఎర్రగడ్డ ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సమీపంలో కుప్పలు కుప్పలుగా చెత్త, ఇతర వ్యర్థాలతో భరించలేని దుర్వాసన వస్తున్నదని స్థానికులు చెబుతున్నారు. జోనల్, డిప్యూటీ కమిషనర్లు నిత్యం పరిధిలో పర్యటించాలి. కానీ అదెక్కడా జరగడం లేదు. జోనల్ కమిషనర్లు పెద్దగా పట్టించుకోకపోవడంతో చాలామంది డిప్యూటీ కమిషనర్లు మధ్యాహ్నం తర్వాత కార్యాలయాలకు వస్తున్నారు. పారిశుధ్య విభాగంలోనూ కొందరు సక్రమంగా విధులకు రావడం లేదనే ఆరోపణలు లేకపోలేదు.

నోళ్లు తెరిచిన బీళ్లు.. పచ్చని పైర్లు

- కేసీఆర్‌తోనే సాగులో విప్లవాత్మక మార్పు
- ఉత్తముల నోట కేసీఆర్ మా(బా)ట
- అనతికాలంలోనే వ్యవసాయంలో పెను మార్పు
- దేశానికి అన్నం పెట్టే వనరులు మన వద్దే ఉన్నాయి
- విశ్రాంత ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

వజ్రోత్సవ సభలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 22: ఆరేడు దశాబ్దాలుగా బీడు భూములుగా సాగు నీటికి నోచుకోక నోళ్లు తెరుచుకొని ఓరకు పడ్డ భూములన్నీ తెలంగాణ రాష్ట్రం సిద్ధించడం, కేసీఆర్ రాకతో, ఆ అపర భగీరథుని వ్యూహంతోనే పచ్చని పైర్లుగా వర్ధిల్లాయని పలువురు శాస్త్రవేత్తలు, ఉత్తమ రైతులు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలను పురస్కరించుకుని రెండు రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు జరుపుకొంది.

దేశంలోని ప్రధాన శాస్త్రవేత్తలను, ఉత్తమ రైతులను, పూర్వపు, ప్రస్తుత విద్యార్థులను పిలిచి ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా ఉత్తమ అవార్డులందుకున్న అధికులు గత పదేళ్లలో అప్పటి సీఎం కేసీఆర్ సాగులో విప్లవాత్మక మార్పు తీసుకు వచ్చారని, ఆ ఫలితాలే నేడు మమ్ములను ఉత్తమ రైతుగా, శాస్త్రవేత్తగా నిలబెట్టాయని, ప్రస్తుతం ఇక్కడ విద్యనభ్యసించిన వారు, ఐఏఎస్, ఐపీఎస్, బ్యాంకర్లు, పారిశ్రామికవేత్తలు, ప్రజా ప్రతినిధులుగా బాధ్యతలు చేపట్టిన పలువురు ప్రత్యక్ష, పరోక్షంగా అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతుకు అనేక సంక్షేమాలు అమలు చేయడం వల్లే ఎడారిని తలపించే బీ(ఊ)ళ్లన్నీ పచ్చ తోరణాలుగా, ఆత్మహత్యలు లేని తెలంగాణగా దేశ వ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. ఈ సందర్భంగా చివరి సెషన్‌లో పూర్వపు విద్యార్థి, విశ్రాంత ఐపీఎస్ అధికారి అయిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, వర్సిటీ వజ్రోత్సవ సందర్భంగా వీసీ అల్దాస్ జానయ్య తీసుకున్న చొరవ వల్లే ఇంత మందిమి కలుసుకునే భాగ్యం కలిగిందన్నారు. భారత్‌లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నూతన వంగడాలు, సేంద్రీయ సేద్యం, నూతన టెక్నాలజీకి అనుగుణంగా సాగువైపు రైతులను మళ్లించాలన్నారు. మనమంతా ఎవ్వరి వృత్తిని వారు గౌరవిస్తూ మంచి ఫలితాలు పొందితే మనం అభివృద్ధి బాటలో నడవటం ఖాయమన్నారు. ప్రపంచ దేశాలలో మనకు ఉన్న వనరులు ఎక్కడా లేవని సూచించారు. సాగు పట్ల మానవ వనరులతో పాటు యాంత్రిక వనరులను అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

దేశంలోనే వివిధ పంటల సాగుకు మన నేలలు, వాతావరణ పరిస్థితులు అనుకూలమన్నారు. ఎక్కువగా చిన్న సన్న కారు రైతులకు అండగా ఉండాలని సూచించారు. ఇతర దేశ వ్యవసాయానికి మనకు చాలా తేడా ఉందని సూచించారు. మన వాతావరణ పరిస్థితులకు తగ్గట్లుగా పరిశోధలు జరగాలని సూచించారు. యాంత్రీకరణ, మార్కెటింగ్ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎరువులు, పురుగు మందులు రైతులు అధికంగా వాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు అవసరమైన వ్యూహాలను రూపొందిండంలో పీజేటీఏయూ వంటి సంస్థలదే కీకల పాత్ర అన్నారు. నేల ఆరోగ్యం, పర్యావరణం, మానవ ఆరోగ్యం వంటి అనేక కోణాలని చూడాలన్నారు. యువతను వ్యవసాయం వైపు పెద్ద ఎత్తున ఆకర్షించగలుగుతామని తద్వారా ఆహార భద్రతను సాధించగలమన్నారు. డిజిటల్ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలన్నారు. పలువురు అభ్యుదయ రైతులకు వీసీ అల్దాస్ జానయ్య ఆధ్వర్యంలో సన్మానం చేసి ప్రశంసా పత్రాలు అందజేశారు.